క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: మండలంలోని రాయలంలో విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో శుక్రవారం 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లపై చెట్లు, కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. గొర్లమూడి, కొమరాడ, డేగాపురం, అనాకోడేరు, తుమ్మగొప్పు, ఈలంపూడి, గ్రామాలతో పాటు ఇండస్ట్రీయల్ లైన్లకు, ఆక్వా చెరువులకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మృతుడి గుర్తింపు

భీమవరం: భీమవరం బస్‌కాంప్లెక్స్‌లో ఈనెల 29వ తేదిన మృతి చెందిన వ్యక్తిని గుర్తించినట్లు వన్‌టౌన్ ఎస్ఐ ఎం వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. మొగల్తూరు మండలం కొప్పర్రుకు చెందిన జి ఆనందకుమార్ కొంతకాలంగా కాళ్ల మండలం పెదఅమిరంలో నివాసముంటున్నాడు. అయితే బుధవారం అనుమానస్పదంగా బస్‌కాంప్లెక్స్‌లో మృతి చెందగా గురువారం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారని వెంకటేశ్వరరావు తెలిపారు.

వైభవంగా మర్లమ్మ జాతర

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారిపాలెం గ్రామంలో ఉన్న శ్రీ మర్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతర మహోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆసాదుల నృత్యాలు, బుట్టబొమ్మలు, తీన్‌మార్ వాయిద్యాలతో అత్యంత కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, పలువురు కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు.

ఆసక్తిని పెంపొందించుకోవడం అభినందనీయం

పెనుగొండ: అరుదైన వస్తువులను సేకరించడం అభినందనీయమని, అలాంటి ఆసక్తిని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని ఆచంట ఎస్సై డి.రాజకుమార్ అన్నారు. ఆచంట భవ్య భారతిలో గురువారం ఆచంటకు చెందిన సామవేదం శ్రీనివాసన్ ఏర్పాటు చేసిన పురాతన నాణేలు, స్టాంపుల ఎగ్జిబిషన్‌ను రాజ కుమార్ ప్రారంభించారు. 80 సంవత్సరాల వయసులో కూడా ఎంతో ఇష్టపూర్వకంగా కాయిన్స్, నోట్స్ సేకరించిన శ్రీనివాసన్‌ను ఆయన అభినందించారు. వివిధ దేశాలకు చెందిన నాణాలతో పాటు అపురూపమైన అరుదైన నాణాలు సేకరణ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మల్లాది రామ శాస్త్రి, కొలిశెట్టి వైష్ణవి, సాయి ప్రియ, పెద్దింటి సీతారామాచార్యులు, మామిడూరి సుబ్రహ్మణ్యం, సాయి లక్ష్మీ, భవానీ, గాయత్రి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దొమ్మ వ్యాధి నిరోధక టీకాలు

యలమంచిలి: గ్రామాల్లో పశువులకు దొమ్మ వ్యాధి నిరోధక టీకాలు ముమ్మరంగా వేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. అడవిపాలెం, ఏనుగువానిలంక, పెదలంక గ్రామాలలో గురువారం పశువులకు దొమ్మ వ్యాధి నిరోధక టీకా, గొర్రెలకు చిటుక వ్యాధి నిరోధక ఎంటరో టాక్సీమియా (ఈటీ) వ్యాక్సిన్ వేసినట్లు ఆయన వివరించారు. ఇంతవరకు 850 పశువులకు, 900 గొర్రెలకు ఈ రెండు రకాల టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం అడవిపాలెం, గుంపర్రు, కాంభొట్లపాలెం, ఇలపకుర్రు, అబ్బిరాజుపాలెం గ్రామాల పశు సంవర్థక సహాయకుల సహాయంతో చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

భూమి సేద్యపు హక్కునకు టెండర్ కమ్ బహిరంగ వేలం పాట ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, కాళ్ల మండలం, కాళ్లకూరు గ్రామంలో వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ... తేది 11.06.2024 తేది మంగళవారం ఉదయం గం.11-00 ని.లకు ... శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానము వద్ద ... కార్యనిర్వహణాధికారి వారిచే టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహించబడును ...

వ.నెం	భూమి ఉన్న గ్రామం	రీ.సర్వే నెం.	విస్తీర్ణం య.సెం.	ప్రథమ దరావత్తు మొత్తం రూ.
1	చెరుకుమిల్లి	230/1బి 298	1-12 1/2, 0-50, 1-62 1/2	2000/-

గ్రామం: కాళ్లకూరు
తేది.30.05.2024

కార్యనిర్వహణాధికారి
సెల్ నెం: 88852 44445



చల్లటి వాతావరణంలో వేసవి విజ్ఞానం



స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో యోగా చేస్తున్న దృశ్యం



యండగండి వేసవి శిక్షణ తరగతుల్లో పేపర్ క్రాఫ్ట్ తయారు చేసిన విద్యార్థులు

ఆకివీడు: వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందిస్తున్నాయని లయన్స్ ప్రతినిధి నెల్లి సతీష్ కుమార్ చెప్పారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో గురువారం స్పోకెన్ ఇంగ్లీష్, కథలు, పద్యాలు, గేమ్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సెలవులకు విద్యార్థులు బంధువుల ఇళ్లకు వెళ్లడం, టూర్‌లు వేయడం జరుగుతుందని చెప్పారు. అయితే శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలకు హాజరవుతున్న విద్యార్థులలో క్రమశిక్షణ, పట్టుదల పెరుగుతున్నాయన్నారు. వారిలో మేథస్సు వృద్ధి చెంది వివిధ అంశాలపై ఆసక్తి రేకెత్తిస్తుందన్నారు. శాఖా గ్రంథాలయ నిర్వాహకురాలు పార్వతి మాట్లాడుతూ శిబిరంలో పాల్గొంటున్న ప్రతి విద్యార్థీ ఏదో ఒక అంశంపై ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. వారికి తెలియని అంశాల్ని శిక్షకులకు అడిగి తెలుసుకొని సాధన చేస్తున్నారన్నారు. వేసవి శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయుల కిషోర్, శ్రీను, సతీష్ వంటి వారు ప్రతి రోజూ వచ్చి విద్యార్థులక సమయం కేటాయించడం అభినందనీయమన్నారు.

విద్యార్థుల్లో మేథాశక్తిని పెంచాలి

ఉండి: విద్యార్థుల్లో మేథాశక్తి పెంపొందేలా అనేక కార్యక్రమాలను నిర్వహించాలని యండగండి కోఆపరేటివ్ బ్యాంక్ అధికారి మమత అన్నారు. యండగండి గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం పేపర్ క్రాఫ్ట్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలల నుంచి 32 మంది విద్యార్థులు హాజరు కాగా వారితో పేపర్‌ను ఉపయోగించి కొత్త కొత్త వస్తువులు తయారు చేసేందుకు ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను పెద్దవారుగా మనం వెలికితీయాలని అన్నారు.అందుకే ఇటువంటి వేదికలు ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థులను వివిధ అంశాలు నేర్పిస్తూ వారిని ప్రోత్సహిస్తే వారు భవిష్యత్‌లో మంచి స్థాయికి ఎదుగుతారని తెలిపారు. అనంతరం పేపర్ క్రాఫ్ట్‌లో ప్రతిభ కనుపరచిన వారికి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధి కారి సీహెచ్ రామకృష్ణ, కోఆపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్, అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్యరాజ్, బైర్రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

క్షణికావేశాలకు గురై జైలు పాలు కావద్దు



ప్రశాంత వాతావరణం ధ్యేయంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆకివీడు: ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు సహకరించాలని, క్షణికావేశాలకు గురై జైలు పాలుకావద్దని ఎస్ఐ బత్తిన నాగబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక జానకీ నగర్‌లో కార్డన్‌సెర్చ్ గురువారం నిర్వహించారు. ఆ ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి తనిఖీలు చేశారు. కౌంటింగ్ సమయంలో ఎవరూ బయట తిరగరాదని, గుంపులు గుంపులుగా తిరిగితే 144 సెక్షన్ అమలులో ఉన్నందున కేసులు పెడతామని హెచ్చరించారు. ఎవరి వద్ద మారణాయుధాలు, ప్రమాదకర వస్తువులు, ఉండకూడదన్నారు. అపరిచితుల్ని ఇళ్ల వద్ద ఉండనివ్వవద్దని కోరారు. కౌంటింగ్ అనంతరం గెలుపోటములు ప్రకటిస్తారని, భావోద్రేకాలకు, ఇతరులపై కామెంట్లు చేయవద్దని హెచ్చరించారు. అల్లర్లకు పాల్పడితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఎస్ఐ తెలిపారు. కార్డన్ చర్చిలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనాన్ని అందించాలి



ఉండిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

ఉండి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఇంటివంటను తలపించేలా మంచి రుచికరంగా పెట్టాలని జిల్లా మిడ్‌డే మీల్ కన్వీనర్ కే కృష్ణారావు అన్నారు. గురువారం ఉండి జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయిలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ విద్యాశాఖ ఆదేశాలను పాటించాలని సూచించారు. విద్యార్థులను తమ బిడ్డలుగా భావించి మెనూ ప్రకారం మంచి రుచిగల భోజనాన్ని వడ్డించాలని తెలిపారు. ఎంఈవో 2 బీ వి నాయకుడు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని శుచితో పాటు రుచిగా వండాలని సూచించారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఏవైనా ఇబ్బందులు వస్తే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలి



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు

ఆకివీడు: డబుల్ లైన్ నిర్మాణంతో ఆకివీడు ప్రాంతంలోని ప్రజలకు కొత్త సమస్యలు తలెత్తాయని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్, విద్యుద్దీకరణ పనులతో బ్రాంచి రైల్వే లైన్‌కు మోక్షం లభించిందని ఆనంద పడ్డామని, అయితే ఆ ఆనందం ఎంతో కాలం నిలవలేదని వాపోయారు. డబల్ రైల్వే లైన్‌లో ప్రతి 15 నిమిషాలకొక రైలు తిరగడం వల్ల స్థానికులు గేట్ల సమస్యకు గురవుతున్నారన్నారు. గత కొన్నేళ్లగా పట్టణంలో అండర్ గ్రౌండ్ మార్గం ఏర్పాటు చేయాలని ఉద్యమించినా రైల్వే అధికారులు పట్టించుకోలేదన్నారు. నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు, రైల్వే అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఏర్పడనున్న ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు అండర్ గ్రౌండ్ మార్గం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. తక్షణంమార్గం కల్పించాలనికోరారు. సమావేశానికి నాయకుడు పెంకి అప్పారావు అధ్యక్షతవహించారు. కార్యక్రమంలో డోకల లక్ష్మి, బీవీ.వర్మ, డోకల రవితేజ, బీ.రాంబాబు రులు పాల్గొన్నారు.

కార్మిక రాజ్య స్థాపనే లక్ష్యం



సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం



శృంగవృక్షంలో కార్మిక కర్షక చిహ్నంతో కూడిన అరుణ పతాకం ఆవిష్కరిస్తున్న జె ఎస్ వి విన్ గోపాలన్

భీమవరం: కార్మిక రాజ్య స్థాపన కోసం సీఐటీయూ ఆవిర్భావించిందని సీఐటీయూ పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాజా రామ్మోహన్ రాయ్ తెలిపారు. ద్యోగ కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా భీమవరం స్థానిక సీఐటీయూ ఆఫీస్ వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. సీఐటీయూ నాయకులు ఎం ఆంజనేయులు, ఎస్ శిరీష్ మెడికల్ రిప్స్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, ఎస్ సత్యనారాయణ కే వెంకటేశ్వరరావు కె.కృష్ణ, డి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

పాలకోడేరు: దోపిడీ రహిత సమాజ స్థాపన సీఐటీయూ లక్ష్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జె.ఎస్.వి గోపాలన్ అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం శృంగవృక్షం రైస్ మిల్ వద్ద కార్మిక కర్షక చిహ్నంతో కూడిన అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సేశపు ఆశ్రీయ్య, గోపాల రాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఐక్యతతో మరిన్ని విస్తృత పోరాటాలు

వీరవాసరం: కార్మిక కర్షక పేదల ఐక్యతతో మరిన్ని విస్తృత పోరాటాలు నిర్వహించాల్సి ఉందని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం ఆంజనేయులు అన్నారు. సీఐటీయూ ఆవిర్భావం సందర్భంగా వీరవాసరంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు వరలక్ష్మి, సత్తిబాబు, నిర్మల, మంగ, శాంతి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పాలకొల్లు అర్బన్: కిశోర బాలికలు రజస్వల అయిన తరువాత రుతుస్రావం ప్రతి నెలా సక్రమంగా జరిగేలా చూసుకోవాలని లంకలకోడేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. ఎం నవ్యజీవన్ కోరారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో కిశోర బాలికలు తీసుకోవాలసిన ఆరోగ్య జాగ్రత్తలు, రుతుస్రావ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.నవ్యజీవన్ మాట్లాడుతూ రుతుస్రావం జరిగిన ఐదు రోజుల కంటే ఎక్కువ రోజులు రక్తస్రావం జరిగితే జాగ్రత్తలు పాటించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే రక్తహీనతకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రుతుస్రావం జరిగే ముందు పొత్తిక డుపులో నొప్పి, రక్తస్రావం జరగకపోవడం వల్ల తెల్లబట్ట కనిపించడం తదితర లక్షణాలు ఉంటే తక్షణం వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. సీడీపీవో సీహెచ్ ఇందిర మాట్లాడుతూ కిశోర బాలికల ఆరోగ్యపరంగా రక్తహీనతకు గురికాకుండా పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ పి.ఎలిజబెత్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సూపర్‌వైజర్ డి.కమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పులఖండం సత్యవేణి, ఎన్.మంగ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సిద్ధాంతంలో కిశోర బాలికల అవగాహన ర్యాలీ నిర్వహించారు. గురువారం సిద్ధాంతంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీఎంఎం రూతుకుమారి, ఏఎన్‌ఎం రత్నకుమారి, హేమసుధ పాల్గొన్నారు.

శృంగవృక్షంలో ముగిసిన హాకీ శిక్షణ శిబిరం



శృంగవృక్షంలో హాకీ శిక్షణలో పాల్గొన్న జట్లుతో నిర్వాహకులు

పాలకోడేరు: శృంగవృక్షం ఉన్నత పాఠశాలలో వేసవి హాకీ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. నెలరోజులపాటు హాకీ క్రీడాకారులకు ఇక్కడ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పాల్గొన్న జట్లకు గత మూడు రోజులుగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జంగం సూరిబాబు మాట్లాడుతూ శృంగవృక్షం గ్రామానికి హాకీ క్రీడకు విడదీయరాని బంధం ఉందన్నారు. ఈ గ్రామం నుంచి జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో ఎంతోమంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటారన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు కూడా జాతీయస్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కలిదిండి ఆనందరాజు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాశీ జగన్నాథరావు, హాకీ శిక్షకుడు నాగబాబు, పూర్వ విద్యార్థులు రవి, పృథ్వీరాజు, శ్రీనివాస్, కౌరు వేణు, మోహనకృష్ణ వర్మ, కౌరు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగ భగలు

ఆకివీడు: భానుడి భగ భగలతో ప్రజలు బెంబేలేత్తిపోయారు.రోహిణి కార్తె తన ప్రభావాన్ని చూపిస్తోంది. గురువారం భానుడు భగభగమంటూ నిప్పులు కురిపించాడు. ఆకివీడులో ఎండ వేడిమికి ప్రజలు విలవిలలాడిపోయారు. గడచిన నాలుగు రోజుల నుంచి నెత్తిపై నిప్పుల కుంపటి అన్నట్లుగా వాతావరణం ఉంది. నిప్పుల కొలిమితో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించేవారు అనేక అవస్థలు పడ్డారు. సూర్యతాపానికి ఇళ్లల్లో నుంచి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. గత నాలుగు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో ఎండ చుర్రుమంటోంది. గురువారం పరిస్థితి మరీ దారుణంగా మారింది. జాతీయ రహదారితో పాటు పట్టణంలోని ప్రధాన రోడ్లు సైతం నిర్మానుష్యంగా మారాయి. సూర్యభగవానుని ఉగ్రరూపానికి ఎవరూ ప్రయాణాలు చేయలేక రద్దు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పది దాటితే ఎవరూ బయట తిరిగే సాహసం చేయలేకపోతున్నారు. రాత్రి వేళల్లో సైతం ఉక్కబోత కారణంగా ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎప్పుడెప్పుడు వర్షాలు కురుస్తాయా అంటూ ప్రజలు ఎదురు చూస్తున్నారు.

జక్కరం మాజీ సర్పంచ్ కూచంపూడి అనారోగ్యంతో మృతి



కూచంపూడి లక్ష్మీపతి రాజు మృతదదేహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కాళ్ల: మండలం జక్కరం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ సర్పంచ్ కూచంపూడి లక్ష్మీపతి రాజు అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. మాజీ సర్పంచ్‌గా గ్రామానికి ఎన్నో సేవలు అందించి అందరికీ తలలో నాలుకలాగా ఉండే లక్ష్మీపతి రాజు ఇకలేరు అనే వార్తను గ్రామస్తులు జీర్ణించుకోలేకపోయారు. ఆయన పార్థివ దేహాన్ని చూసేందుకు గ్రామస్తులంతా తరలివచ్చారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, పాతపాటి మురళీ రాజు, సీపీఎం నాయకులు బి బలరాం, జేఎన్వీ గోపాలం, రామలింగరాజు, గోపాల రాజు, రామకృష్ణ, గ్రామ పెద్దలు లక్ష్మీపతి రాజు పార్థివ దేహాన్నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కౌంటింగ్‌కు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఓ స్వామినాయుడు

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆచంటలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. భీమవరంలోని బి.సీత పాలిటెక్నికంపు కళాశాల 2వ అంతస్తులో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈవీఎం ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఉంటాయని, ప్రతీ టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, సహాయకుడు, మైక్రో,అబ్జర్వర్‌ను నియమిస్తున్నామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు 4 టేబుల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కౌంటింగ్ అధికారులు మూడు దశల్లో సాంకేతిక విధానంలో ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. కౌంటింగ్ టేబుల్ సంఖ్య అనుగుణంగానే ఏజెంట్లను అనుమతిస్తామన్నారు. వారి ఫారం 18 , గుర్తింపు కార్డులను జారీ చేస్తామన్నారు. నేర చరిత్ర కలిగిన వారిని, బైండోవర్ కేసులు నమోదైన వారిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించకుండా అభ్యర్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలక్షన్ ఏజెంట్లు బ్యాలెట్ పేపర్స్ సీరియల్ నంబరు వారీగా కూర్చోవాలన్నారు. అభ్యర్థి, వారి ఏజెంట్లులో ఎవరో ఒకరిని మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, అరగంట తువాత ఈవీఎం ఓట్లు లెక్కిస్తామన్నారు. రౌండ్ల వారీ ఫలితాలు ఏజెంట్లుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. వాటిని ఫారం 17సీ తో నిర్ధారించుకోవాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత మాత్రమే 5 ఈవీఎంలకు చెందిన వీవీ ప్యాట్‌లోని ఓట్లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి లెక్కిస్తామన్నారు. 6వ తేదీ వరకూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. బాణసంచా కాల్పులు చేయరాదని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీ జి.శ్రీనివాస రావు మాట్లాడుతూ శాంతి భద్రతలపై పటిష్టమైన చర్యలు తీసుకొన్నామన్నారు. బాణసంచా విక్రయాలు, పెట్రోలు విక్రయాలపై నోటీసులు జారీ చేశామన్నారు. సమావేశంలో అభ్యర్థుల ఏజెంట్లుతో పాటు తహసీల్దారులు ఐపీ శెట్టి, ఎంపీడీఓలు పి.నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ఘోర ప్రమాదం



సిద్ధాపురంలో రైల్వే హైటెన్షన్ హెచ్చరిక ఇనుప రాడ్డును గుద్దుకుని ఆగిన లారీ

ఆకివీడు: స్థానిక సిద్ధాపురం రోడ్డులో రైల్వే గేటులోని హైటెన్షన్ వైర్లకు సమీపంలో లోడు లారీ ప్రమాదపు అంచుల్ని దాటుకుని గురువారం హెచ్చరిక ఇనుప రాడ్డును ఢీకొట్టింది. సిద్ధాపురం వైపు నుంచి ఆకివీడు ప్రధాన సెంటర్ వైపు భారీ ఎత్తులో వేసిన లోడు లారీ ప్రమాద హెచ్చరికల్ని భేఖాతరు చేసింది. దీంతో హెచ్చరిక రాడ్డు విరిగి లారీపై పడిపోయింది. గేటు మధ్యలో ఉన్న హైటెన్షన్ వైర్లను తాకి ఉంటే లారీ అగ్నిప్రమాదానికి గురై దగ్ధమైపోయి ఉండేదని ప్రజలు బెంబేలెత్తిపోయారు. భారీ లోడుతో ఉన్న లారీ ఒక వైపు హెచ్చరిక రాడ్డును దాటుకుని, హైటెన్షన్ వైర్లకు తగలకుండా బయట పడి, గేటు రెండవ వైపు ఉన్న రాడ్డుకు చిక్కడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా ప్రమాదం నుంచి బయట పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



